క్లుప్తంగా

వరిలో అగ్గి తెగులు నివారించండి



వరి పైరును పరిశీలిస్తున్న ఏవో ఫరూక్

ముండ్లమూరు (కురిచేడు): మండలంలో సాగు చేసిన వరి పైరులో అగ్గి తెగులు ఆశించినట్లు మండల వ్యవసాయాధికారి ఫరూక్ తెలిపారు. దాని నివారణకు రైతులు చర్యలు చేపట్టాలని సూచించారు. మంగళవారం ఆయన మండలంలోని కెల్లంపల్లి, పసుపుగల్లు గ్రామాల్లోని సాగు చేసిన వరి పంటలను పరిశీలించారు. అగ్గి తెగులు నివారణకు మందులు వాడాలని చెప్పారు. కార్యక్రమంలో గ్రామ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

బీసీ కార్పొరేషన్ సహకారం పొందండి



మాట్లాడుతున్న ఎంపీపీ సుంకర సునీత

ముండ్లమూరు (కురిచేడు): బీసీ కార్పొరేషన ద్వారా ఇచ్చే పరికరాలు అందుకుని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని ఎంపీపీ సుంకర సునీత కోరారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలోని సమావేశపు హాలులో మంగళవారం ఎంపీడీఓ ఆర్.జనార్దన్ అధ్యక్షతన జరిగిన ఆదరణ 3 సమావేశానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. బీసీలు, ఆర్థికంగా వెనుకబడిన వర్గాల వారు ఈ పథకానికి అర్హులని, చేతివృత్తుల వారు పరికరాలను కార్పొరేషన్ ద్వారా రాయితీలో పొందాలని సూచించారు. బీసీ సంఘ నాయకులు, ప్రజలు హాజరయ్యారు.

మహిళలకు టైలరింగ్‌లో ఉచిత శిక్షణ

పొదిలి రూరల్: పొదిలి మండలంలోని 9 గ్రామ సచివాలయాల పరిధిలో గల బీసీ, ఈడబ్ల్యూఎస్ వర్గాల మహిళలకు టైలరింగ్‌లో ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు ఎంపీడీఓ శోభన్‌బాబు తెలిపారు. 18 నుంచి 45 ఏళ్ల మధ్య మహిళలకు 90 రోజులపాటు శిక్షణ ఇస్తామని పేర్కొన్నారు. ఆసక్తి గల మహిళలు శిక్షణ కేంద్రం, ఎంపీడీఓ కార్యాలయం, సచివాలయంలో సంప్రదించి యాప్‌లో పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.

నేడు వెలుగొండలో వస్తు విక్రయ వేలం

కొనకనమిట్ల: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం వెలుగొండ స్వామి ఆలయ బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని పలు రకాల వస్తువులు విక్రయించుకునేందుకు బుధవారం బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈవో ఈదుల చెన్నకేశవరెడ్డి తెలిపారు. ఈనెల 13వ తేదీ నుంచి 25వ తేదీ వరకు నిర్వహించే వెలుగొండ స్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా పూజా ద్రవ్యాలు, కొబ్బరికాయల విక్రయం, కొబ్బరి చిప్పలు పోగుచేసుకోవడం, అలాగే బ్రహ్మోత్సవాల ముందు రోజు నుంచి వచ్చే ఏడాది బ్రహ్మోత్సవాల ముందు వరకు తలనీలాలు పోగుచేసుకునే హక్కుకు సంబంధించి ఆలయ ప్రాంగణంలో వేలం నిర్వహిస్తున్నట్లు వివరించారు. ఆసక్తి ఉన్నవారు ముందుగా రూ.10 వేల ధరావత్తు చెల్లించాలని పేర్కొన్నారు. వేలంలో హక్కులు పొందిన వారు పూర్తి మొత్తాన్ని చెల్లించాలని స్పష్టం చేశారు. వివరాలకు 80999 49996ను సంప్రదించాలని ఈఓ తెలిపారు.

పారిశుధ్య పనుల్లో జాప్యం తగదు

కొనకనమిట్ల: గ్రామాల్లో పారిశుధ్య పనులు చేపట్టడంలో జాప్యం చేయవద్దని డీఎల్‌పీఓ ఎన్‌వీఎల్.హనుమంతరావు పేర్కొన్నారు. మంగళవారం చినారికట్ల జంక్షన్ వద్ద పారిశుధ్య పనులను ఆయన పర్యవేక్షించారు. గ్రామల్లో నిర్మించిన చెత్త నుంచి సంపద కేంద్రాలను పూర్తి వినియోగంలోకి తెచ్చి వర్మీ కంపోస్ట్ తయారు చేయాలని పంచాయతీ కార్యదర్శికి సూచించారు. ఆయన వెంట ఈఓఆర్డీ శ్రీదేవి, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసులు, సచివాలయ ఉద్యోగులు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో మాజీ సర్పంచ్‌కు గాయాలు

రాచర్ల: ఎదురెదురుగా వస్తున్న రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొనడంతో మాజీ సర్పంచ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన మండలంలోని జేపీ చెరువు గ్రామ సమీపంలోని లక్ష్మీదేవి గుడి వద్ద చోటుచేసుకుంది. వివరాలు.. జేపీ చెరువు గ్రామానికి చెందిన నెమలిగుండ్ల రంగనాయకస్వామి మాజీ చైర్మన్, జేపీ చెరువు మాజీ సర్పంచ్ కన్నసాని ఓబులేసు ఉదయం తన మోటరు సైకిల్‌పై చినగానిపల్లె గ్రామానికి వెళ్తున్నారు. అదే సమయంలో చినగానిపల్లె నుంచి జేపీ చెరువు వైపు మరో బైక్ వస్తోంది. ఈ రెండు బైకులు బలంగా ఢీకొనడంతో మాజీ సర్పంచ్ కన్నసాని ఓబులేసు కింద పడిపోయి తీవ్రంగా గాయపడ్డారు. సమీపంలోని పొలాల్లో పనిచేస్తున్న కూలీలు గమనించి ఓబులేసు కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. హుటాహుటిన ప్రైవేట్ వాహనంలో గిద్దలూరులోని ప్రైవేట్ వైద్యశాలకు తరలించారు.

నిలిచిన తరగతి గదుల నిర్మాణాలు



దేవరాజుగట్టులో నిర్మాణం నిలిచిన తరగతి గది



మధ్యలోనే నిలిచిన తరగతి గదుల నిర్మాణం

- అవస్థలు పడుతున్న విద్యార్థులు

పెద్దారవీడు:

వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు పాఠశాలలో మౌలిక వసతులు కల్పించేందుకు నాడు- నేడు పనులు చేపట్టారు. ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ పాఠశాలకు ఏ మాత్రం తగ్గకుండా వాటి రూపురేఖలు మార్చారు. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ప్రతి పాఠశాలలో తరగతి గదులు ఉండాలని భావించి అదనపు గదులు నిర్మాణాలు చేపట్టారు. మండలంలోని దేవరాజుగట్టు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 6 నుంచి 10వ తరగతి వరకు 120 మంది బాల బాలికలు చదువుతున్నారు. అదనపు తరగతి గదులకు, పాఠశాల అభివృద్ధి పనుల కోసం గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం నాడు-నేడు పథకం ద్వారా రూ.88 లక్షలు మంజూరు చేసింది. వాటిల్లో 57 లక్షల రూపాయలు ఖర్చు పెట్టినట్లు అధికారులు చెబుతున్నారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పాఠశాలలో రెండు అదనపు తరగతి గదుల నిర్మాణ పనులు నిలిచిపోయాయి. ఒక తరగతి గదికి ప్లాస్టింగ్ చేశారు కానీ నేలకు బండలు, తలుపులు, కిటికీలు, కరెంటు, ఫ్యాన్లు, తదితర మైనర్ పనులు చేపట్టాల్సి ఉంది. ఈ తరగతి గదిలో ప్రస్తుతం విద్యార్థులకు విద్యను కొనసాగిస్తున్నారు. కిటికీలకు తలుపులు బిగించక పోవడంతో సాయంత్రం పూట ఎండ పడుతుందని, వెలుపల చెట్ల పొదలు ఉండటంతో పాములు, తేళ్లు, ఎలుకలు లోపలికి వస్తాయోమోనని భయందోళనగా ఉందని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రెండు తరగతి గదుల నిర్మాణాలు పూర్తి అయితే గదుల సమస్య తీరుతుందని ఉపాధ్యాయులు, విద్యార్థులు భావిస్తున్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు పరుగులు పెట్టించిన తరగతి గదుల నిర్మాణం కూటమి ప్రభుత్వం రావడంతో అర్ధంతరంగా నిలిచి పోయాయి. దీంతో ఏం చేయాలో తెలియక ఉపాధ్యాయులు ఉన్న తరగతి గదుల్లో, అసంపూర్తిగా ఉన్న గదిలో విద్యార్థులను కూర్చోపెట్టి పాఠాలు చెబుతున్నారు. కూటమి ప్రభుత్వం, విద్యాశాఖాధికారులు స్పందించి మధ్యలోనే నిలిచి పోయిన తరగతి గదుల నిర్మాణాలను పూర్తి చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు కోరుతున్నారు.

సూపర్ సిక్స్ పేరుతో మోసం

- పెద్దారవీడు వైఎస్సార్ సీపీ నాయకుల ధ్వజం



విలేకరులతో మాట్లాడుతున్న పెద్దారవీడు వైఎస్సార్ సీపీ నాయకులు

పెద్దారవీడు: సూపర్ సిక్స్ సంక్షేమ పథకాలు అమలు చేస్తామని చెప్పిన టీడీపీ ప్రభుత్వం ప్రజలను నిలువునా మోసం చేసిందని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పాలిరెడ్డి కృష్ణారెడ్డి, జెడ్పీటీసీ ఏర్వ చలమారెడ్డి విమర్శించారు. మంగళవారం సాయంత్రం మండలంలోని దేవరాజుగట్టులో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఎన్నికల సమయంలో అబద్ధాల హామీలతో గద్దనెక్కిన టీడీపీ నాయకులు ఇచ్చిన హామీలను నేరవేర్చకుండా స్థానిక ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్‌పై విమర్శించడం హాస్యాస్పదంగా ఉందన్నారు. నియోజకవర్గంలో ఉన్న సమస్యలపై నిరంతరం ప్రశ్నిస్తున్న ఎమ్మెల్యే గొంతును నొక్కడానికే అని అర్థమవుతోందని, ప్రజలకు ఇచ్చిన హామీపై దృష్టి పెట్టకుండా ఎదురుదాడి చేస్తూ ప్రజలను మభ్యపెట్టేందుకు ప్రయత్నిస్తున్నారని చెప్పారు. ఎన్నికల ముందు, ఎన్నికల తర్వాత కూడా ప్రజలను మోసం చేయడం టీడీపీ నాయకులకే దక్కిందని, అధికారం కోసం రాష్ట్ర ప్రజలను మోసం చేశారని, ఇంతకన్నా దారుణం మరొకటి ఉండదన్నారు. ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ ప్రజల పక్షాన నిలిచి సమస్యలపై ప్రశ్నించడాన్ని కూటమి నాయకులు జీర్ణించుకోలేక ఎమ్మెల్యేపై ఎదురు దాడికి దిగడాన్ని ప్రజలు గమనిస్తున్నారని పేర్కొన్నారు. గ్రామాల్లో ఉన్న ప్రజా సమస్యలపై ఎప్పటికప్పుడు ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తూ వారి సమస్యల పరిష్కారానికి నిరంతం పోరాటం చేస్తూనే ఉంటారన్నారు. అధికారంలోకి వచ్చి కేవలం 8 నెలల్లోనే పథకాలు అమలు చేయడం చేతకాక చేతుల్లేసిన టీడీపీ ప్రభుత్వం ప్రజల్లో విశ్వాసం కోల్పోయిందన్నారు. ప్రస్తుత పరిస్థితిల్లో ప్రజల పక్షాన ఉండి గ్రామాల్లో ఉన్న తాగునీటి, రైతుల గిట్టుబాటు ధరలు, తదితర సమస్యలపై బాధ్యతగా తీసుకొని పోరాడుతున్న ఎమ్మెల్యేను విమర్శించడం విడ్డురంగా ఉందని వైఎస్సార్ సీపీ నాయకులు ధ్వజమెత్తారు. సమావేశంలో పార్టీ మండల ఉపాధ్యక్షుడు తోకల ఆవులయ్య, పార్టీ సోషల్ మీడియా జిల్లా కన్వీనర్ వెన్నా శివకృష్ణారెడ్డి, పార్టీ జిల్లా అధికార ప్రతినిధి ఏలూరి వెంకట నారాయణరెడ్డి, పార్టీ దివ్యాంగుల విభాగం జిల్లా అధ్యక్షుడు గుర్రం ముత్యాలయ్య, సర్పంచ్‌లు పాలగిరి రామాంజనేయరెడ్డి, గుడ్డెపోగు రమేష్, మండల కో ఆప్షన్ సభ్యుడు షేక్ బుజ్జీ, మండల నాయకులు గుండారెడ్డి వెంకటేశ్వరరెడ్డి, కంచర్ల కేశయ్య, చిరంజీవి, మెట్టు భాస్కర్‌రెడ్డి, ఏర్వ సేనారెడ్డి, మారంరెడ్డి శివారెడ్డి ఉన్నారు.

పంట నమోదు చేసుకోవాలి



రైతులతో మాట్లాడుతున్న ఏవో నిర్మలాదేవి

పుల్లలచెరువు: గ్రామాల్లో ప్రస్తుత రబీ సీజన్‌లో రైతులు సాగు చేస్తున్న పంటలు ఈ-క్రాప్‌లో నమోదు చేసుకోవడంతో పాటు ఈకేవైసీ చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి నిర్మలాదేవి అన్నారు. మంగళవారం మండలంలోని నాయుడుపాలెం, కవలకుంట్ల గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించి రైతులకు పలు సూచనలు చేశారు. ఆమె మాట్లాడుతూ రబీ సీజన్‌లో పంట నమోదు, ఈకేవైసీలు ఈ నెల 6వ తేదీలోపు చేయించుకోవాలన్నారు. ప్రతి రైతు తన విశిష్ట సంఖ్య కోసం రైతు సేవా కేంద్రంలో నమోదు చేసుకోవాలని ఏవో సూచించారు. వీఏఏలు భాను, కోటేశ్వరనాయక్‌తో పాటు రైతులు పాల్గొన్నారు.

ట్రాక్టర్ల పంపిణీలో తలెత్తిన విభేదాలు

తాళ్లూరు: గ్రామాల పరిశుభ్రతకు ఇళ్లలో ఉండే చెత్తాచెదారాన్ని డంపింగ్ యార్డుకు తరలించేలా ట్రాక్టర్స్ ఉపయోగించుకోవాలని దర్శి నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి గొట్టిపాటి లక్ష్మి అన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయం వద్ద స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ ట్రాక్టర్ల పంపిణీ కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. లక్కవరం, నాగబొట్లపాలెం, బొద్దికూరపాడు, శివరాంపురం గ్రామాలకు మంజూరైన ట్రాక్టర్లను దర్శి నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి గొట్టిపాటి లక్ష్మి, లలితసాగర్ ప్రారంభించారు. అనంతరం అంగన్‌వాడీ కార్యకర్తలు నిర్వహించిన ఫుడ్ స్టాల్‌ను ఆమె పరిశీలిస్తుండగా శివరాంపురం గ్రామానికి మంజూరైన ట్రాక్టర్ వద్ద ఆ గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్తల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. గ్రామ టీడీపీ నాయకుల జోక్యం చేసుకొని ఇరువర్గాల వాగ్వాదాన్ని సద్దుమణిగించారు. ఎంపీపీ టి.శ్రీనివాసరావు, ఎంపీడీఓ డి.హనుమంతరావు, ఇన్‌చార్జి తహసీల్దార్ ఇమ్మానియేలు పాల్గొన్నారు.

కంఠస్థ పద్యాల్లో విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులు ప్రదర్శిస్తున్న లఘు నాటిక



సర్టిఫికెట్లు అందజేస్తున్న ఎంఈఓలు, ఉపాధ్యాయులు

దర్శి (కురిచేడు): జిల్లా స్థాయి లఘునాటిక, కంఠస్థ పద్యాల పోటీల్లో మండలంలోని కట్టసింగన్నపాలెం ప్రాథమిక పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. జిల్లా బాలోత్సవంలో కట్టసింగన్నపాలెం పాఠశాల నుంచి సిరి టీం ప్రదర్శించిన ప్లాస్టిక్ భూతం అనే లఘు నాటిక అందరినీ ఆలోచింపజేసింది. కంఠస్థ పద్యాలు విభాగంలో రామిశెట్టి వెంకటలక్ష్మి రాగయుక్తంగా పాడి అలరించింది. ఈ రెండు విభాగాల్లో జిల్లా స్థాయిలో జూనియర్స్ విభాగంలో తృతీయ స్థానాలు సాధించారు. వీరికి మెడల్స్, జ్ఞాపికలు, సర్టిఫికెట్లు మండల విద్యాశాఖాధికారులు కె. రఘురామయ్య, బీవీ రమాదేవిల చేతుల మీదుగా అందజేశారు. విద్యార్థులను, తర్ఫీదు ఇచ్చిన ఉపాధ్యాయుడు గొర్రెపాటి వేణును పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పి.సుధాకరరావు, ఉపాధ్యాయులు అభినందించారు. ఉపాధ్యాయులు సయ్యద్ సుభానీ, సీహెచ్ హైమావతి పాల్గొన్నారు.

కందుల కొనుగోలు కేంద్రం ప్రారంభం



కందుల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న అధికారులు

కురిచేడు: స్థానిక ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం ఆధ్వర్యంలో కందుల కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం ప్రారంభించారు. వ్యవసాయాధికారి పి.మధుబాబు, పీడీసీసీ బ్యాంకు మేనేజర్ డి.శ్రీనివాసులు, అసిస్టెంట్ మేనేజర్ ఎం.రవితేజ, పీఏసీఎస్ పర్సనల్ ఇన్‌చార్జి జి.వరప్రసాద్‌లు కందుల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వ్యవసాయాధికారి మధుబాబు మాట్లాడుతూ మండలంలోని కంది పంట సాగు చేసిన రైతులు కొనుగోలు కేంద్రంలో విక్రయించుకోవచ్చని తెలిపారు. క్వింటాకు మద్దతు ధర రూ.7,550 నిర్ణయించినట్లు చెప్పారు. తేమశాతం 12 లోపు ఉండాలని పేర్కొన్నారు. పీఏసీఎస్ సీఈఓలు గూడూరి చిన్న కోటేశ్వరరావు, ఆలూరి వీరబ్రహ్మం, వీఏఏలు జె.వెంకటేశ్వర్లు, ఏవీ రామాంజనేయులు, రైతులు పాల్గొన్నారు.

విద్యతోనే ఉజ్వల భవిష్యత్

కొనకనమిట్ల: విద్యతోనే ఉజ్వల ఉజ్వల భవిష్యత్ సాధ్యమవుతుందని మర్రిపాలెం జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం నాగేశ్వరరావు పేర్కొన్నారు. మంగళవారం పాఠశాల ఆవరణలో 10వ తరగతి విద్యార్థుల వీడ్కోలు కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ముందుగా సరస్వతీదేవి విగ్రహానికి పూజలు చేశారు. పదో తరగతి విద్యార్థులు పబ్లిక్ పరీక్షల్లో నూరు శాతం ఉత్తీర్ణత సాధించాలని ఉపాధ్యాయులు ఆకాంక్షించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు, పాఠశాల ఉపాధ్యాయుడు సానికొమ్ము వెంకటేశ్వరరెడ్డి ప్రదర్శించిన మయసభ నాటకంలోని దుర్యోధుని ఏకపాత్రాభినయం ఆహూతులను అలరించాయి. కార్యక్రమంలో పాఠశాల కమిటీ సభ్యులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



ఉపాధ్యాయులతో విద్యార్థులు



బూచేపల్లికి కృతజ్ఞతలు తెలుపుతున్న మేడికొండ జయంతి

ఎమ్మెల్యే బూచేపల్లికి మహిళా నేత కృతజ్ఞతలు

ముండ్లమూరు (కురిచేడు): వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మహిళా విభాగం రాష్ట్ర కార్యదర్శి మేడికొండ జయంతి మంగళవారం జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, దర్శి శాసన సభ్యుడు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డిలను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అనుబంధ విభాగాల్లో రాష్ట్ర స్థాయి పదవి వచ్చేందుకు కృషి చేసిన వారిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఆమెతో పాటు ఎంపీపీ సుంకర సునీతా బ్రహ్మారెడ్డి, పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

మధ్యాహ్న భోజనం రుచిగా ఉండాలి



మధ్యాహ్న భోజనం తనిఖీ చేస్తున్న ఎంఈవో

పుల్లలచెరువు: ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు రుచికరమైన భోజనం అందజేయాలని ఎంఈవో ఇందిర అన్నారు. మండలంలోని పెద్ద పీఆర్‌సీ తండా, చిన్ని పీఆర్‌సీ తండా, కొమరోలులోని ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులకు అందజేసే భోజనం పరిశుభ్రమైన ప్రదేశంలో రుచికరంగా ఉండాలన్నారు. రోజూ ప్రభుత్వం సూచించిన మెనూను మాత్రమే అందజేయాలన్నారు. ఉపాధ్యాయులు రుచి చూసిన తర్వాతే విద్యార్థులకు వడ్డించాలన్నారు. విద్యార్థులతో చదవడం, రాయడం నేర్పించాలన్నారు. ఉపాధ్యాయులు శిక్షణలో నేర్చుకున్న అంశాలను జాగ్రత్తగా విద్యార్థులకు వివరిస్తూ వారి అభివృద్ధికి బాటలు వేయాలన్నారు. ఉపాధ్యాయులు అశ్రద్ధ చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

గంగదేవిపల్లిలో మహిళా దినోత్సవం



బాలింతలకు పోషకాహారం అందిస్తున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్

దొనకొండ: మండలంలోని గంగదేవిపల్లిలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సీహెచ్ సుభాషిణి ఆధ్వర్యంలో మంగళవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇద్దరు ఆడ పిల్లలకు పుట్టిన రోజు నిర్వహించి తల్లులకు సూచన, సలహాలు అందజేశారు. కిశోర బాలికల తల్లులు సమతుల్య ఆహారం తీసుకుంటే ఆరోగ్యంగా ఉంటారన్నారు. అన్ని పోషకాలు ఉండే ఆహారం తీసుకుని జాగ్రత్తగా ఉండాలన్నారు. ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రంగా ఉండాలని సూచించారు. ఆహారంతో పాటు ఐరన్ మాత్రలు తీసుకోవాలని గర్భిణులు, బాలింతలకు సూచించారు. యాక్టివ్ సూపర్‌వైజర్ ఏ.ఆదిలక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

అనధికార కార్యక్రమానికి అధికారుల హడావుడి



గొట్టిపాటి లక్ష్మికి బొట్టు పెడుతున్న కార్యాలయ సిబ్బంది

కురిచేడు: అనధికార కార్యక్రమానికి మండల అధికారుల హడావుడి ఆశ్చర్యానికి గురి చేసింది. మండలంలోని ఆవులమంద గ్రామ పంచాయతీకి స్వచ్ఛ కార్పొరేషన్ ద్వారా ట్రాక్టర్ మంజూరైంది. దాన్ని ప్రారంభించేందుకు స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం ఏర్పాట్లు చేశారు. టీడీపీ ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, లలిత్‌సాగర్‌లు ప్రారంభించారు. దానికి ఎంపీడీఓ సతీష్‌బాబు గ్రూపుల్లో అంతా హాజరు కావాలని మెసేజీలు చేయడంతో పాటు కార్యాలయ సిబ్బంది ట్రాక్టర్‌కు పూజ చేసి ప్రారంభోత్సవంలో పాల్గొనటం చర్చనీయాంశమైంది. ఈ విషయమై ఎంపీడీఓ సతీష్‌బాబును వివరణ కోరగా అనధికార కార్యక్రమమైనా అందరికీ విషయం చేరవేయాలని మెసేజ్ చేశానన్నారు. ఆవులమంద పంచాయతీ కార్యాలయానికి స్వచ్ఛ కార్పొరేషన్ ద్వారా వచ్చిన ట్రాక్టరైనందున ఇక్కడ ప్రారంభోత్సవ ఏర్పాట్లు చేశామని తెలిపారు.

సారాబట్టీలపై ఎక్సైజ్ అధికారుల దాడులు



నిందితులతో ఎక్సైజ్ పోలీసులు

పెద్దదోర్నాల: మండల పరిధిలోని తిమ్మాపురం పరిసర ప్రాంతాల్లో నాటుసారా తయారీ కేంద్రాలపై ఎక్సైజ్ అధికారులు మంగళవారం విస్తృత దాడులు నిర్వహించి భారీగా నిల్వ ఉంచిన బెల్లం ఊటను ధ్వంసం చేశారు. నాటుసారాను స్వాధీనం చేసుకున్నారు. దాడులకు సంబంధించి ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ ఎం.వెంకటరెడ్డి మాట్లాడుతూ మండల పరిధిలోని తిమ్మాపురం పరిసర ప్రాంతాల సమీపంలో నాటుసారా తయారు చేస్తున్నారన్న విశ్వసనీయ సమాచారంతో దాడులు నిర్వహించినట్లు తెలిపారు. దాడుల్లో మోటారు సైకిళ్లపై నాటుసారా రవాణా చేస్తున్న పోతురాజు, మండ్ల వెంకటేశ్వర్లును అదుపులోకి తీసుకోవడంతో పాటు సారా రవాణాకు వినియోగిస్తున్న 2 మోటారు సైకిళ్లను, 20 లీటర్ల నాటుసారా, 270 కేజీల బెల్లం స్వాధీనం చేసుకున్నారు. 260 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేసినట్లు తెలిపారు. నాటుసారా తయారీకి బెల్లాన్ని సరఫరా చేసిన వ్యక్తిని సైతం అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. పనుకుమడుగు గిరిజన గూడెంలో చెంచు గిరిజనులకు నాటుసారాతో జరిగే అనర్థాలపై అవగాహన కల్పించినట్లు ఆయన తెలిపారు.